సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం । 24 । జూలై । 2024



ర్యాలీని జయప్రదం చేయాలి
చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న మహార్యాలీని జయప్రదం చేయాలని లవకుమార్ పిలుపునిచ్చారు. - IIలో



చెత్త డంపింగ్‌కు యార్డు ఏదీ?
ఆలేరు మున్సిపాలిటీలో చెత్త డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - IIIలో



సమస్యల పరిష్కారం కోసమే..
సమస్యలు తెలునుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే పోరుబాట పట్టినట్లు సీపీఎం నాయకులు పేర్కొన్నారు. - IIIలో

న్యూస్‌రీల్

'బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం'

భువనగిరి టౌన్ : బడ్జెట్‌లో రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపిందని, వికసిత్ భారత్‌లో తెలంగాణ లేదా అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పునర్విభజన చట్టం ఆంధ్రప్రదేశ్ మాదిరిగానే తెలంగాణకు కూడా వర్తిస్తుందన్నారు. బయ్యారం స్టీల్ ప్లాంట్ ప్రస్తావన లేకపోవడం, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీకి నిధులు కేటాయించపోవడం తగదన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్‌ను కూడా విస్మరించారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచారని, అయినా బడ్జెట్‌పై రాష్ట్రంపై వివక్షత ప్రదర్శించిందని ఆరోపించారు. బడ్జెట్‌పై ఎనిమిది మంది ఎంపీలు బడ్జెట్‌పై ప్రశ్నించాలని కోరారు.

చదువుతోనే భవిష్యత్



స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న రియాజ్

భువనగిరి : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించినప్పుడే బంగారు భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. మంగళవారం భువనగిరిలోని ఎంఎస్‌ఆర్ గార్డెన్‌లో మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టంతో చదివి తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ఆడపిల్లలు ఇంటికే పరిమితం కాకుండా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఆయన స్థానిక జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. సిబ్బందిని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ వసీం మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిటీ కార్యదర్శి మొయినోద్దీన్, సయ్యద్ జావేద్ ఖాద్రీ, రఫీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అతహర్, మజాహర్, అవెజ్ చిస్తీ, అబ్దుల్ ఘనీ, సుజావుద్దీన్, అహ్మద్, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వలో జాగ్రత్తలు తప్పనిసరి



మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతి

భువనగిరి రూరల్ : ధాన్యం నిల్వ ఉంచిన సమయంలో చీడ,పీడల నివారణకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐపీహెచ్‌ఎం సహాయ సంచాలకులు జ్యోతి పేర్కొన్నారు.వ్యవసాయ ఉత్పత్తులను నిల్వచేయు గిడ్డంగులు, ధాన్యం నిల్వలో తీసుకోవల్సిన జాగ్రత్తలు, నిల్వ చేసిన ధాన్యంపై రుణాలు పొందే అంశాలపై బొల్లెపల్లి రైతువేదికలో జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ విభాగం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ గోదాముల్లో నిల్వచేసే దాన్యంపై 4 నుంచి శాతం రుణం పొందే అకాశం ఉందన్నారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ చీడ, పీడల నివారణపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం నాగిరెడ్డిపల్లిలోని గిడ్డంగులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ కంచి మల్లయ్య, శాస్త్రవేత్త కె.మమత, ఏఈఓ సతీష్, అభ్యుదయ రైతులు చిన్న వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఆకు పూజ



యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో మంగళవారం ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. ప్రధానాలయంతో పాటుగా, విష్ణు పుష్కరిణి వద్ద, పాత గుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకాలు చేశారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ఆ తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఇక స్వయంభూవులకు, నిత్యపూజలు సంప్రదాయరీతిలో చేపట్టారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. సాయంత్రం జోడు, వెండి సేవలు ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ. 9,62992 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

విధుల్లో చేరిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్



జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వార్డులను పరిశీలిస్తున్న నూతన సూపరింటెండెంట్ రాజారావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, డీసీహెచ్‌ఎస్ చిన్ననాయక్

భువనగిరి : జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాజారావు మంగళవారం విధుల్లో చేరారు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. అదే విధంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్ వికారాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో బదిలీపై వచ్చిన సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి కూడా బాధ్యతలు స్వీకరించారు. విధుల్లో చేరిన అనంతరం సూపరింటెండెంట్‌తో కలిసి జిల్లా ఆస్పత్రిని సందర్శించి ఓపీ విభాగాలు, వార్డులను పరిశీలించారు. అలాగే మెడికల్ కళాశాలకు సంబంధించి 30 మంది ప్రొఫెసర్లు విధుల్లో చేరారు.

ఫ్చ్.. లాభం లేదు!

కేంద్ర బడ్జెట్‌పై విశ్లేషకుల పెదవి విరుపు

- స్పష్టత రాని రైల్వే ప్రాజెక్టులు
- వ్యవసాయ రంగానికి, చిన్నతరహా పరిశ్రమలకు కొంత ఊరట
- ముద్ర రుణం పరిమితి పెంపుతో స్వయం ఉపాధికి ఊతం



సాక్షి, యాదాద్రి : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో జిల్లాకు ఒరిగిందేమీ లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రత్యేక కేటాయింపులంటూ ఏమీ లేంటూ పెద విరిస్తున్నారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వలేదు. ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రోడ్డు ప్రస్తావనే లేదు. పరోక్షంగా రైతులు, యువతకు మాత్రం మేలు చేకూరనుంది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో యాంత్రీకరణ, పంటలకు మద్దతు ధర పెరిగే అవకాశముంది. నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలు ప్రకటించడంతో జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెంచడంతో స్వయం ఉపాధి పొందుతున్న వ్యాపారులకు మేలు చేకూరనుంది.

సాగుకు చేయూత



కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం దక్కింది. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక నిధులు ఇవ్వడంతో యాంత్రీకరణ వైపు అడుగులు వేసే అవకాశముంది. ఏటా పంటల మద్దతు ధరను పెంచుతుండగా.. ఈ బడ్జెట్‌లోనూ ప్రతిపాదనలు చేయడం యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 2లక్షల మంది రైతులకు ఆసరా కానుంది. కూరగాయల సాగుతో పాటు సేంద్రియ వ్యవసాయం పెరిగే అవకాశం ఉంది. సుమారు 10వేల మంది కూరగాయలు సాగు చేస్తున్నారు.

నిరుపేదలకు సొంతిల్లు



ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇళ్లు లేని పేదలకు లబ్ధి చేకూరనుంది. ప్రజాపాలనలో సుమారు లక్ష మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారు.కేంద్రం ఇచ్చే నిధులతో వీరందరికీ లబ్ధి చేకూరనుంది.



కాజీపేట మూడో లైన్ ప్రస్తావనే లేదు

కాజీపేట మూడో రైల్వే లైన్‌కు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. ఘట్కేసర్–యాదాద్రి ఎంఎంటీఎస్‌కు కేటాయింపుల స్పష్టత లేదు. 248 కిలో మీటర్ల నిడివి ఉన్న బీబీనగర్– నడికుడి మార్గంలో రెండో లైన్ నిర్మాణానికి మాత్రం రూ. 200 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

సమాన పనికి సమాన వేతనం లేదు



సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతం ఇవ్వడం లేదు.ఎన్నికల ముందు రైల్వే ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో రూ. 15 వేలు మాత్రమే ప్రకటించింది. కుటుంబ పోషణకు ఏమాత్ర సరిపోవు. అయితే కార్మికులకు అద్దె గృహాల నిర్మాణం స్వాగతించవల్సిన అంశం.

-ఆకుల శ్రీనివాస్, జాతీయ రైల్వే ఔట్ సోర్సింగ్ కార్మిక విభాగం అధ్యక్షుడు

నిరుద్యోగుల్లో ఆశలు



నిరుద్యోగులకు మూడు ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహకాలు ప్రకటించడంతో జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. యాదాదిర జిల్లాలో ఇప్పటికే దండుమల్కాపూర్, చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి పారిశ్రామిక వాడలతోపాటు రైస్‌మిల్లులు, భవన నిర్మాణరంగంలో సుమారు లక్ష మంది పని చేస్తున్నారు. చిన్న, మధ్య తరహా కంపెనీలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అంతేకాకుండా పరిశ్రమల్లో పని చేసే కార్మికుల కోసం అద్దె ఇళ్లు నిర్మిస్తామిన కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. అలాగే ఎంఎస్‌ఎంఈ ద్వారా రానున్న క్రెడిట్ గ్యారంటీ స్కీంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముద్ర రుణం పెంచడం సంతోషం



గత ఏడాది రూ.50 వేలు ముద్ర రుణాలు తీసుకొని పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. కేంద్ర బడ్జెట్‌లో ముద్ర రుణ పరిమితిని రూ.20 లక్షల వరకు పెంచడంతో సంతోషంగా ఉంది. బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా రుణాలు మంజూరు చేస్తే చిరు వ్యాపారులు ఆర్థికంగా మరింత నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

-కోసిని లిఖిత, చిరువ్యాపారి, భూదాన్‌పోచంపల్లి

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రాధాన్యం ఇచ్చారు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రామీణ అభివృద్ధితో పాటు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చింది. ఉద్యోగులకు స్లాబ్ పరిధిని పెంచడం కొద్దిగా ఊరట నిచ్చింది. కానీ మరింత స్లాబ్ పెంచితే బాగుండేది. విద్యారంగానికి ప్రాధాన్యం కల్పించలేదు. 25 శాతం బడ్జెట్ కేటాయిస్తే విద్యా వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉండేది.

-డాక్టర్ అంజిరెడ్డి, అర్థశాస్త్ర విభాగం అధిపతి, ఎంజీ యూనివర్సిటీ

వ్యాపారులకు దన్ను

రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. రుణ పరిమితి మొత్తాన్ని పెంచడంతో స్వయం ఉపాధి రంగంలో ముందుకు సాగుతున్న వారికి దన్నుగా నిలవనుంది. జిల్లాలో పది వేలకుపైగా వీధి వ్యాపారులు ఉన్నారు. ఇతర వ్యాపారాలు చేసే వారు లక్ష మంది వరకు ఉన్నారు. .



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఎస్‌ఎఫ్‌ఐ కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

భువనగిరిటౌన్ : స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కలెక్టరేట్‌లోనికి దూసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం కొందరు నాయకులను మాత్రమే కలెక్టరేట్‌లోకి అనుమతించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లావుడియా రాజు, చింతల శివ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,214 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. యాదాద్రి జిల్లాలో సుమారు రూ.730 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ఉపకారవేతనాలు, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయనిపక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కుక్కుట్ల శివాణీ, వేముల నాగరాజు, కాసుల నరేష్, ఈర్ల రాహుల్, శ్రీనివాస్, ఉదయ్ పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేయండి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



బ్యాంకులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

యాదగిరిగుట్ట రూరల్ : రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రెన్యూవల్ చేయాలని కలెక్టర్ హనుమంత్ కే.జెండగే ఆదేశించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను మంగళవారం ఆయన సందర్శించారు. బ్యాంకుల్లో రుణమాఫీ జరిగిన తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించారు. రుణమాఫీ జరిగిన విషయాన్ని రైతులకు ఫోన్ ద్వారా సమాచారం అందజేసి మరల రుణాలు తీసుకోవచ్చనే విషయం వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఏఓ అనురాధ తదితరులు ఉన్నారు.

కొన్ని నిర్ణయాల వల్ల వెనుకబడ్డాం

- వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం
- రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్

చౌటుప్పల్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీపరంగా తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల అధికారాన్ని కైవసం చేసుకోవడంలో బీజేపీ వెనుకబడిందని పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ తెలిపారు. అయితే నిరంతరం ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై కొట్లాడి అధికారానికి చేరువయ్యామన్నారు. చౌటుప్పల్‌లో మంగళవారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని కోరుకొని అధికారం ఇవ్వలేదని.. బీఆర్‌ఎస్‌పై ఉన్న కోపంతో కాంగ్రెస్‌ను గెలిపించారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోవడం ఖాయమన్న విషయం సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తెలుసన్నారు. ఎవరు అడ్డుపడినా వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం బీజేపీదేనన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఐదేళ్లు మనుగడ సాగించడం అనుమానంగానే ఉందన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే సంఖ్య పెంచుకోవడంపైనే సీఎం దృష్టిసారించారని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ కేంద్ర నిధులు, పథకాల పంపిణీ విషయంలో పార్టీ కార్యకర్తలను భాగస్వామ్యం చేయాలని అధిష్టానాన్ని కోరుతా మ ని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓబీసీ జాతీయ కమిటీ సభ్యుడు కడగంచి రమేష్, బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనూరి వీరారెడ్డి, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, అశోక్‌కుమార్, అసెంబ్లీ కన్వీనర్ భిక్షంగౌడ్, మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, పడమటి జగన్మోహన్‌రెడ్డి, చందా మహేందర్‌గుప్త పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, వేదికపై బూర నర్సయ్యగౌడ్, గంగిడి తదితరులు

కుక్కల బెడద తీవ్రంగా ఉంది

- బయటకు రావాలంటేనే జంకుతున్నాం
- డ్రెయినేజీలు సరిగ్గా లేవు
- ఖాళీ ప్లాట్లలో నిండా చెట్లు మొలిచాయి
- దోమల వ్యాప్తి పెరిగింది

'సాక్షి' ఫోన్ ఇన్ ద్వారా సమస్యలు వివరించిన భువనగిరి ప్రజలు

భువనగిరిటౌన్ : పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఎక్కడ చూసినా గుంపులుగా సంచరిస్తున్నాయి. వాహనాలపై వెళ్తున్నవారిని కూడా వెంబడించి కరుస్తున్నాయి. డ్రెయినేజీలు సరిగా లేవు. మురుగు నీరు రోడ్లు, వీధుల్లో ప్రవహిస్తోంది. ఖాళీ ప్లాట్లన్నీ చెట్లు, పిచ్చిమొక్కలతో నిండి ఇళ్లలోకి విష పురుగులు వస్తున్నాయని చౌటుప్పల్ పట్టణవాసులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలపై మంగళవారం సాక్షి నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డికి వివరించారు.

ప్రశ్న : కోతుల బెడద తీవ్రంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలి.
– శ్రీనివాస్, కిసాన్‌నగర్

కమిషనర్ : ఇప్పటికే 650 కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలేశాం. మిగతా కోతులను కూడా పట్టి తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ప్రశ్న : పట్టణంలో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉంది.
–నీలం శరత్ (ప్రగతినగర్), శంకర్ (హన్మాన్‌వాడ), రవి (ఓంకార్ ఆశ్రమం), నగేష్, విద్యానగర్, సురేష్‌గౌడ్ (అర్బన్‌కాలనీ)

కమిషనర్ : 2,500 కుక్కలు ఉన్నట్లు గుర్తించాం. వీటిలో 1,490 కుక్కల్లో సంతాన ఉత్పత్తి తగ్గించేందుకు ఆపరేషన్లు నిర్వహించాం. భవిష్యత్తులో కుక్కల బెడద తగ్గుతుంది.

ప్రశ్న : వసుందర థియేటర్ ప్రాంతంలో సీసీ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు.
–కరుణాకర్, వసుందర థియేటర్ ఏరియా

కమిషనర్ : సీసీ రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేస్తున్నాం. ఇప్పటికే నీటి సరఫరా, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి.

ప్రశ్న : రాంనగర్ కాలనీలో డ్రెయినేజీలు సరిగా లేక రోడ్లపై మురుగు నీరు నిలుస్తోంది.
–శ్రీధర్, లవయ్య

కమిషనర్ : రాంగనర్ ఏరియాలో డ్రెయినేజీల నిర్మాణం కోసం రూ.21లక్షలు కేటాయించి తీర్మానం చేశాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ప్రశ్న: తారకరాంనగర్‌లోని సాయికృప కళాశాల వెనుక నివాసాల మధ్య పిచ్చి మొక్కలను, కంపచెట్లు తొలగించాలి.
–ఎండీ మహమూద్

కమిషనర్ : పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశిస్తాం.

ప్రశ్న : పట్టణంలో చాలా చోట్ల స్పీడ్ బ్రేకర్లు లేవు. వాహనాల వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.
–నర్సింహ, నారాయణరెడ్డి,మీనానగర్



ఫోన్‌లో సమస్యలు వింటున్న మున్సిపల్ కమిషనర్ రామాంజులరెడ్డి

కమిషనర్ : అవసరమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : హౌజింగ్‌బోర్డు కాలనీలో ఓపెన్‌జిమ్ ప్రదేశంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. లైట్లు కూడా లేవు.
–పిన్నింటి బలరాంరెడ్డి

కమిషనర్ : జిమ్ ఉన్న ప్రాంతంలో హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయి. పిచ్చి మొక్కలను తక్షణమే తొలగిస్తాం.

ప్రశ్న : బాహర్‌పేటలో పలు చోట్ల రోడ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.
– వెంకటరమణ

కమిషనర్ : వివిధ వార్డుల్లో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

ప్రశ్న : ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెరిగి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
–ప్రవీణ్‌కుమార్, రాయగిరి

కమిషనర్ : ఓపెన్ ప్లాట్లు, ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తాం.

ప్రశ్న :రాంనగర్‌లో రోడ్డుపై ఉన్న షెడ్డు వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వెంటనే తొలగించాలి.
–రాజ్‌కుమార్, మామిడాల రమేష్

కమిషనర్ : స్థానికులతో చర్చించి షెడ్డును తొలగిస్తాం.

ప్రశ్న : తారకరాంనగర్ రైల్వే ట్రాక్ పక్కన చెత్త వేస్తుండడంతో దోమలు వస్తున్నాయి.
–ఉడుత సిద్దులు

కమిషనర్ : స్థానికులకు అవగాహన కల్పించి చెత్త వేయకుండా చూస్తాం.

ప్రశ్న : తాతానగర్‌లో కూల్చిన శ్మవానవాటిక ప్రహరీని నిర్మించాలి.
–పూస శ్రీనివాస్

కమిషనర్ : శ్మశానవాటిక ప్రహరీ కూల్చినవేసిన అంశం హైకోర్టు స్టేలో ఉంది.

ప్రశ్న : రాయగిరిలో వీధి దీపాలు సరిగా లేవు. వర్షాకాలం కావడంతో రాత్రివేళ బయటకు వెళ్లలేకపోతున్నాం.
–నిరూపాక్షి

కమిషనర్ : విద్యుత్ సిబ్బందిని పంపించి కొత్త లైట్లు ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : డ్రెయినేజీలు రోడ్ల కంటే ఎత్తు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం.
–శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, తేజస్వి, జక్కన్నగూడెం

కమిషనర్ : డ్రెయినేజీలు ఎత్తున్న ప్రాంతాలను విజిట్ చేస్తాం.

ప్రశ్న : గిరిజన బాలికల హాస్టల్ ఎదురుగా మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.
–సంధ్య, సింగన్నగూడెం

కమిషనర్ : జాతీయ రహదారి పక్కన గుంత ఉండడం వల్ల నీరు నిలుస్తోంది. సంబంధిత అధికారులకు తెలియజేస్తాం.

ప్రశ్న : ఆజాద్‌రోడ్డు నుంచి జంక్కన్నగూడెం చౌరస్తా వరకు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ చెత్తతో నిండి మురుగునీరు బయటకు వస్తుంది.
–నవీన్, అనంతారెడ్డి, ఖాజిమోహల్లా, సతీష్‌రెడ్డి, అజాద్‌రోడ్డు

కమిషనర్ : పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి డ్రెయినేజీని శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న : ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు లేవు. రాత్రి సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి
– రాములు, ఇందిరమ్మ కాలనీ

కమిషనర్ : మరమ్మతులకు గురైన వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : భారీ వాహనాలు వెళ్లినప్పుడు డ్రెయినేజీలపై మ్యాన్‌హోల్స్ దెబ్బతింటున్నాయి. భారీ వాహనాలు వెళ్లకుండా చూడాలి.
–ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కిసాన్‌నగర్

కమిషనర్ : ధ్వంసమైన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయిస్తాం. వాటిపై భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

క్లుప్తంగా

బ్యాటరీ పేలి ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనం దగ్ధం

చిలుకూరు : చార్జింగ్ అవుతుండగా బ్యాటరీ పేలి ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని రామాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిగురుపాటి నాగేశ్వర్‌రావు తన ఎలక్ట్రిక్ ద్విచక్రవాహానానికి చార్జింగ్ పెట్టాడు. అది ఎంతోసేపటికి చార్జింగ్ కాకపోవడంతో స్విచ్ఛాఫ్ చేశాడు. వెంటనే బ్యాటరీ పేలి మంటలు అంటుకుని వాహనం పూర్తిగా దగ్ధమవ్వడంతో పాటు ఇంటి ఆవరణలోని పలు పరికరాలు కొంతమేరకు దెబ్బతిన్నట్లు బాధితుడు వెల్లడించారు.

పాముకాటుతో వలస కూలీ మృతి

కట్టంగూర్ : బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ కూలీ పాముకాటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని రాంగనర్‌లో గల పచ్చ రమణమ్మ ఇటుకబట్టీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం నబరంగాపూర్ జిల్లా దబుగాన్ మండలం కారగామ్ గ్రామానికి చెందిన శబిలం మానాసింగ్ బిందాని(26) వలస కూలీ ఇటుకబట్టీలో పనిచేసేందుకు వారం రోజుల క్రితం కట్టంగూర్‌కు వచ్చాడు. రోజువారి మాదిరిగా కూలీలు పనులు ముగించుకొని సోమవారం రాత్రి నేలపై నిద్రిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున మానాసింగ్ పాముకాటుకు గురయ్యాడు. కూలీల ద్వారా విషయం తెలుసుకున్న ఇటుకబట్టీ సూపర్‌వైజర్ వి.జలేందర్ చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం ఉదయం ఇటుకబట్టీ వద్దకు వచ్చి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న మానాసింగ్ నిద్రలోనే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శబిలం బిందాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు

నాంపల్లి: చికిత్స నిమిత్తం తన వద్దకు వచ్చిన వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌ఎంపీ వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దాపురం గ్రామానికి చెందిన పల్లె వెంకటయ్య(42)కు సోమవారం అర్ధరాత్రి ఛాతిలో నొప్పి రావడంతో చికిత్స నిమిత్తం నాంపల్లి మండల కేంద్రంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు రాగిఫణి మురళీధరాచారి వద్దకు వెళ్లాడు. వెంకటయ్యకు చికిత్స చేసి తెల్లవారుజామున ఇంటికి వెళ్లమని ఆర్‌ఎంపీ వైద్యుడు సూచించాడు. వెంకటయ్య ఇంటికి వెళ్లగానే ఛాతిలో మళ్లీ తీవ్రనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకురాగా.. మాల్‌కు తీసుకెళ్లమని సూచించాడు. మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెంకటయ్యను తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. వెంకటయ్య మృతికి ఆర్‌ఎంపీ వైద్యుడే కారణమని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు మృతదేహాన్ని వైద్యుడి క్లినిక్ ఎదుట ఉంచి ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆర్‌ఎంపి వైద్యుడు మురళీధరాచారిని అరెస్ట్ చేశారు. మృతుడి కుమారుడు పల్లె ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు. మృతిడికి భార్య, కుమారుడు, కుమారుడు ఉన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



దేవరకొండ: గొట్టిముక్కల రిజర్వాయర్ వద్ద సీపీఎం నాయకులు



మర్రిగూడ: శివన్నగూడ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పరిశీలించిన సీపీఎం నాయకులు

దేవరకొండ, డిండి, మర్రిగూడ, నాంపల్లి: దేవరకొండ నియోజకవర్గంలో గల పెండింగ్ ప్రాజెక్టులను ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులు, డిండి మండల పరిధిలోని సింగరాజుపల్లి రిజర్వాయర్‌తోపాటు మండల కేంద్రంలోని డిండి ప్రాజెక్టును, మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడ ప్రాజెక్టు, నాంపల్లి మండలంలోని కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ పనులను సీపీఎం రాష్ట్ర కమిటీ బృందం మంగళవారం పరిశీలించింది. రిజర్వాయర్ నిర్మాణ సామర్థ్యం, భూ సేకరణ, ఆర్‌అండ్‌ఆర్ వర్తింపు వంటి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని కిష్టరాయినిపల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చింతపల్లి రిజర్వాయర్ల పూర్తికి అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించడంతోపాటు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని కోరారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ప్రాజెక్టు నత్తనడకన సాగడానికి గత ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ఓ ఆమోదం పొందకుండానే ఏర్పాటు చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల్లో ఫ్లోరైడ్ భూతాన్ని తరిమివేయడంతో పాటు జిల్లాలో 1.40లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేయకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కిష్టరాయన్‌పల్లి రిజర్వాయర్ భూ నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, నర్సిరెడ్డి, నల్ల వెంకటయ్య, కంబాలపల్లి ఆనంద్, నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి గాయాలు



గాయపడిన కొయిలయ్య



డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

చౌటుప్పల్: లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ఆర్టీసీ బస్సు పక్క నుంచి వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండల పరిధిలోని ధర్మోజిగూడెం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ డిపోకు చెందిన ఆర్టీసీ డీలక్స్ బస్సు ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తోంది. ఈ క్రమంలో చౌటుప్పల్ మండలం ఎల్లంబావి గ్రామ శివారులోని వినాయకుడి ఆలయం దాటాక ముందున్న లారీని బస్సు ఓవర్‌టేక్ చేయబోయి.. పక్క నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శికి చెందిన తండ్రీ కుమారులు కొయిలయ్య, పాపారావుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాద జరిగిన సమయంలో బస్సు వేగంగా వెళ్లి రోడ్డు పక్కన లారీలు ఆగేందుకు ఏర్పాటు చేసిన లేన్ డివైడర్‌ను ఢీకొని ఆగిపోయింది. లేదంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని ప్రయాణికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హైనా దాడిలో గేదె దూడలు మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత

డిండి: హైనా దాడిలో రెండు గేదె దూడలు మృతిచెందాయి. ఈ ఘటన మంగళవారం డిండి మండలం కొత్తతండాలో జరిగింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తతండాకు చెందిన పాత్లావత్ పాండు గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో సోమవారం సాయంత్రం రెండు గేదె దూడలను కట్టేసి ఉంచాడు. సోమవారం ఉదయం పాండు పొలం దగ్గరకు వెళ్లగా అప్పటి వరకే దూడలు మృతిచెంది ఉండటంతో ఫారెస్ట్ అధికారులకు సమాచార ఇచ్చాడు. ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. గేదె దూడలపై హైనా దాడి చేసినట్లు గుర్తించామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సరిత తెలిపారు.

గంజాయి పట్టివేత

- నిందితుడి నుంచి కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట డీఎస్పీ రవి



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటరూరల్: గంజాయి విక్రయించేందుకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట డీఎస్పీ రవి మంగళవారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం పెన్‌పహాడ్ ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి సింగారెడ్డిపాలెం గ్రామ శివారులో బోసుకుంట చెరువు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. పెన్‌పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మకంటి గోపి బైక్‌పై సూర్యాపేట వైపు వెళ్తున్నాడు. గోపిని పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా అతడు బైక్ ఆపకుండా వెళ్లిపోయాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకొని బైక్ పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా.. తన స్నేహితుడైన చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన గుండు గోపితో కలిసి జూన్ 29న ఆంధ్రా–ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులో బాప అనే వ్యక్తి వద్ద కేజీ గంజాయి రూ.2000 చొప్పున రెండు కేజీలు కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చి చెరో కిలో చొప్పున పంచుకున్నట్లు తెలిపాడు. తన వద్ద ఉన్న గంజాయిని బొమ్మకంటి గోపి సూర్యాపేటకు తీసుకెళ్లి విక్రయిద్దామని వెళ్తుండగా పెన్‌పహాడ్ పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడి వద్ద కేజీ గంజాయి, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గుండు గోపిని కూడా చిలుకూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పెన్‌పహాడ్ ఎస్‌ఐ రవీందర్, ఏఎస్‌ఐ వెంకటరత్నం, కానిస్టేబుళ్లు ప్రవీణ్, లింగరాజు, రామాంజనేయులను డీఎస్పీ అభినందించారు.

నూకల లోడ్ లారీ తనిఖీ

మేళ్లచెరువు : మండల పోలీసులు తనిఖీల్లో భాగంగా సోమవారం రాత్రి బియ్యం లోడ్‌తో ఓ లారీ వెళ్తున్నట్లు అనుమానంతో పట్టుకున్నారు. వెంటనే ఆ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా లారీలోడ్ రేషన్ బియ్యమా కాదా అని నిర్ధారణ చేసేందుకు సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం వారు వచ్చి లారీలో ఉన్న సరుకును శాంపిల్‌లు సేకరించి మాట్లాడారు. అవి రేషన్‌బియ్యం కాదని సన్ననూకలని గుర్తించారు. లారీ మేళ్లచెరువులోని శ్రీనివాస పార్‌బాయిల్డ్ రైస్‌మిల్ నుంచి కల్వకుర్తిలోని శ్రీఆంజనేయ ట్రేడర్స్ అనే బీరు తయారీ కంపెనీకి వెళ్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలో సివిల్ సప్లయ్ డీటీ రాజశేఖర్, క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ పరమేష్ తదితరులు ఉన్నారు.

బీబీనగర్ టోల్‌గేట్ వేబ్రిడ్జిపై కేసు నమోదు



అధికారితో మాట్లాడుతున్న లారీ యజమానులు

బీబీనగర్ : మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న వేబ్రిడ్జిలో అవకతవకలు జరుగుతున్నాయని తెలంగాణ స్టేట్ లారీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు మంగళవారం జిల్లా మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు వేబ్రిడ్జిని తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అధికారులు అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించి కేసు నమోదు చేసినట్లు, తదుపరి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. కాంటా సుమారు నాలుగు టన్నుల మేర ఎక్కువ తూకం చూపిస్తుండడంతో లారీ యజమానులను తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. ఇటీవల నిబంధనల ప్రకారం ఇసుక రీచ్‌ల నుంచి లోడ్‌తో వెళ్తున్న 12లారీలను శుక్రవారం అధికారులు బీబీనగర్ టోల్‌గేట్ వద్ద తనిఖీ నిర్వహించి తూకం వేయాలని, ఆ వేబ్రిడ్జిలో తూకం వద్దు అంటూ లారీడ్రైవర్లు, యజమానులు అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకోకుండా కేసు నమోదు చేస్తామని బెదిరించారని అన్నారు. ఈ వేబ్రిడ్జిపై గతంలో కూడా అవకతవకలు జరిగాయని మొరపెట్టుకున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా అదే వేబ్రిడ్జిపై తూకం వేయడంతో అధిక జరిమానాలు చెల్లించి లారీ యజమానులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లారీ యజమానులకు న్యాయం చేకూర్చేవిధంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాసుల మహేష్‌గౌడ్, సంతోష్‌యాదవ్, ముక్కర్ల స్వామి, రమేష్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత పరిరక్షణ ర్యాలీని జయప్రదం చేయాలి



మహా ర్యాలీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టై అండ్ డై అసోసియేషన్ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత ఇక్కత్ ప్రింటింగ్ వస్త్రాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చేపట్టనున్న మహా ర్యాలీని జయప్రదం చేయాలని పోచంపల్లి టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సంఘం భవనంలో మహా ర్యాలీ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని నేతన్న విగ్రహం నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని తెలిపారు. మాస్టర్ వీవర్స్, వస్త్ర వ్యాపారులు, చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. వారసత్వంగా వస్తున్న చేనేత ఇక్కత్ కళకు ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ఇచ్చిందని అన్నారు. కానీ మిల్లుల్లో ఇక్కత్ డిజైన్లు కల్గిన డూప్లికేట్ వస్త్రాలు తయారు చేసి షాపింగ్‌మాల్స్, దుకాణాలలో అతి తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత కార్మికుల ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. డూప్లికేట్ చీరలను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కర్నాటి బాలరాజు, పద్మశాలీ చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత చీరల ఉత్పత్తిదారుల సంఘం ఉపాధ్యక్షుడు పాలాది యాదగిరి, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం, సిల్క్‌యారన్ మర్చంట్ అధ్యక్షుడు సూరెపల్లి రవీందర్, ఏకేఎల్‌బీ అసోసియేషన్ అధ్యక్షుడు గుండు శ్రీరాములు, ఏర్వ నీలమ్మ, మంగళపల్లి రమేశ్, గంజి బాలరాజు, వనం దశరథ, సీత భవానీ, శంకర్, కందగట్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి బలవన్మరణం



రాజు (ఫైల్)

నల్లగొండ క్రైం: కుటుంబ కలహాలతో సోమవారం సాయంత్రం తన ఇంట్లో గడ్డి మందు తాగిన నల్లగొండ జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కేతారపు రాజు(36) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బంటుగూడేనికి చెందిన ఆయన ఇటీవల రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నుంచి బదిలీపై నల్లగొండ అగ్నిమాపక కార్యాలయానికి వచ్చారు. సోమవారం కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కతాల్‌గూడెం గ్రీన్‌సిటీ కాలనీలో గల తన నివాసానికి వెళ్లి గడ్డి మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్యాభర్తల మధ్య కలహాల కారణంగానే జీవితంపై విరక్తి చెంది తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి కృష్ణయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడి భార్య బాబమ్మ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. వారికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి

- బైక్‌పై వెళ్తుండగా ఢీకొట్టిన కారు



రాజు (ఫైల్)

కోదాడరూరల్: బైక్‌పై వెళ్తున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌ను కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన చింత రాజు(23) సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై ప్రస్తుతం ట్రైనింగ్‌లో ఉన్నాడు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఉత్తమ్‌పద్మావతిరెడ్డి కాలనీలో తను నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేసేందుకు నీళ్లు కొట్టి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ ఫ్లైఓవర్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దాదాపు ఇరవై అడుగుల దూరంలో ఎగిరిపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ప్రస్తుతం లీవ్‌లో ఉన్నట్లు తెలిసింది.

టోల్‌ప్లాజాలను అప్రమత్తం చేసిన పోలీసులు

ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లగా.. కారు నంబర్ ప్లేట్ ఒకటి బైక్‌లో ఇరుక్కుంది. మరొకటి కొద్ది దూరంగా విరిగి పడింది. కారు నంబర్ ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన అనుదీప్‌దిగా పోలీసులు గుర్తించారు. కోదాడ పట్టణ పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వైపు ఉన్న పోలీస్ స్టేషన్లు, టోల్‌ప్లాజాల సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ సమీపంలో చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద కారును గుర్తించి పట్టుకున్నారు. అక్కడి నుంచి కారును కోదాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..?

- పోలీసుల అదుపులో ఆరుగురు వ్యక్తులు



విచారిస్తున్న విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్, పోలీసులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని మత్స్యకారుల కాలనీలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైజాగ్ నుంచి వచ్చిన మత్స్యకారులు నాగార్జునసాగర్ జలాశయ తీరంలో ఇళ్లు నిర్మించుకుని చేపల వేటకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఇటీవల నలుగురు అన్నదమ్ములు నూతనంగా ఇళ్లు నిర్మించుకున్నారు. వారిలో ఒకరు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థలో లాంచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రతి అమావాస్య, ఆదివారం రోజు హైదరాబాద్ నుంచి కొత్త వ్యక్తులు వచ్చి అతడి ఇంట్లో పూజలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత రెండు నెలలుగా వైబ్రేటర్లను ఉపయోగించి ఆ ఇంట్లో 15అడుగుల లోతు గుంత తవ్వగా.. పెద్దపెద్ద శబ్దాలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం స్థానిక పోలీసులు మత్స్యకారుల కాలనీకి వెళ్లి అన్నదమ్ములను విచారించగా.. తమ ఇంట్లో గజ్జెల చప్పుడు వస్తుందని, తవ్వకాలు జరిపితే ఎల్లమ్మ తల్లి బయటకు వస్తుందని గుంత తవ్వినట్లు చెప్పారు. మరోసారి అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయని విడివిడిగా ఉండేందుకు గాను మరుగుదొడ్డి నిర్మాణానికి గుంత తవ్వుతున్నట్లు చెప్పారు. 10అడుగులున్న గదిలో మొత్తం గుంత తవ్వడంతో మరుగుదొడ్డి నిర్మాణం ఎక్కడ చేస్తారని పోలీసులు వారిని ప్రశ్నించగా.. పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురి టౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. పోలీసుల అదుపులో తవ్వకాలు జరిపిన ఇంటి యజమానితో పాటు అతడి అన్నదమ్ములు, మంత్రగాళ్లు ఉన్నట్లు సమాచారం.

తీగలాగితే డొంక కదిలే అవకాశం..

గతంలో నాగార్జునసాగర్ జలాశయం మధ్యలో గుట్టపై గల ఏశేశ్వర మల్లికార్జునస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారు. అదేవిధంగా ఇటీవల పెద్దవూర మండలం పోతునూరు గ్రామం సమీపంలో, దేవరకొండ ఖిలాపై, తిరుమలగిరి(సాగర్) మండలం నెల్లికల్లు గ్రామంలోని పాడుబడిన దేవాలయంలో తవ్వకాలు జరిపారు. గతంలో బీఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేసే ఓ ఉద్యోగి, ప్రభుత్వ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఉద్యోగి, మరికొందరు కలిసి ముఠాగా ఏర్పడి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేవారని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులు విచారణ జరిపితే ఇంకా చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడకు చెందిన కత్తుల నర్సింహ(45) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం వర్క్‌ర్ల కోసం బైక్‌పై తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లికి వెళ్తుండగా కేశరాజుపల్లి హ్యాపీ హోప్స్ సమీపంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింహకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. నర్సింహ కుమారుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిప్పర్తి ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

కనగల్: కారు ఢీకొని గాయాలపాలైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. కనగల్ ఎస్‌ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పర్సన బోయిన లక్ష్మమ్మ(68) సోమవారం మధ్యాహ్నం జి. యడవల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారి వెంట నడుచుకుంటూ తన వ్యవసాయ భూమికి వెళ్తుండగా.. వెనుక నుంచి కారు వచ్చి ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మమ్మకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆమెను నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన కారు డ్రైవర్ పారుపాక దిలీప్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

పాలకవీడు: మండల పరిధిలోని మహంకాళిగూడెం వద్ద గల డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని ఓ కిరాణ దుకాణంలో మంగళవారం పోలీసులు భారీగా గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. డెక్కన్ సిమెంట్ పరిశ్రమలోని కిరాణ దుకాణంలో గుట్కాలు అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆ దుకాణాన్ని తనిఖీ చేసి రూ.11వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గత ప్రభుత్వ తప్పిదాలతోనే భూ సమస్యలు

- రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు



నడిగూడెం: బాధితురాలు లక్ష్మమ్మను పరామర్శిస్తున్న వి. హనుమంతరావు

భానుపురి (సూర్యాపేట): గత ప్రభుత్వం అవలంబించిన తప్పుడు విధానాలతోనే రాష్ట్రంలో అనేక మంది రైతులు, సామాన్య ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రాజ్యసభ మాజీ సభ్యుడు వి. హనుమంతరావు అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన రైతు మేడం ముత్తయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిని ఇతరులు కబ్జా చేయడం బాధాకరమన్నారు. రైతుకు వచ్చిన భూ సమస్య విషయంలో అప్పటి రెవెన్యూ అధికారులదే పూర్తి తప్పిదమని తెలిపారు. బాధితుల నుంచి వివరాలు తెలుసుకునేందుకు తాను గ్రామానికి వెళ్లానని, వారితో మాట్లాడానని చెప్పారు. ధరణి లోపాలను అడ్డు పెట్టుకొని గత పాలకులు, అధికారులు ఎన్నో పొరపాట్లు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు పట్టాదారులను కాదని అనర్హులకు భూమి పట్టా చేశారని అన్నారు. ధరణిని పూర్తి ప్రక్షాళన చేయ్యాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. గతంలో పటేల్ పట్వారీ వ్యవస్థ గ్రామాల్లో ఉన్నప్పుడు ఇలాంటి భూ సమస్యలు లేవని, ఆ వ్యవస్థ రద్దు కావడం, ధరణి రావడంతో అనేక భూ సమస్యలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, నాయకులు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు..

నడిగూడెం: మండలంలోని రామాపురం గ్రామానికి మంగళవారం వి. హనుమంతరావు వెళ్లి సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం ఆత్మహత్యాయత్నం చేసిన మేడం ముత్తయ్య కుటుంబ సభ్యులు మేడం లక్ష్మమ్మ, పుల్లమ్మ, అరుణను పరామర్శించారు. భూ సమస్యలుంటే అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలి తప్ప.. ఆత్మహత్యలకు పాల్పడొవద్దని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బాధితులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.